క్లుప్తంగా

సండే ఈవినింగ్ టాక్

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం 'సండే ఈవినింగ్ టాక్' కార్యక్రమాన్ని నిర్వహిస్తారు, సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుంది. ఈ సందర్భంగా 'సైబర్ క్రైమ్స్ అవేర్‌నెస్' అనే అంశంపై సైబరాబాద్‌లోని ఎస్‌సీఎస్‌సీ సైబర్ సెక్యూరిటీ సీనియర్ మేనేజర్, సైబర్ రక్షక్ ఆపరేషన్స్ హెడ్ భాను యాచరేని ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు. మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్ 040–23001234లో సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు.

గ్యార్వీ షరీఫ్ వేడుకలు



శేరిలింగంపల్లి: గ్యార్వీ షరీఫ్ వేడుకలను శుక్రవారం ఓల్డ్ లింగంపల్లిలో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ వేడుకల్లో స్థానిక కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ పాల్గొని ముస్లిం యువకులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జరిగిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో నాయకులు వీరేశంగౌడ్, రాజుయాదవ్, ఖాజాపాష, అజీమ్, రాంచందర్, పద్మారావు, అస్లాం, గఫార్, రవియాదవ్, గోపాల్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అత్యాధునిక పరికరాలతో వైద్యం

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నల్లగండ్లలోని అమెరికన్ ఆంకాలజీ ఇనిస్టిట్యూట్‌లో ఎథోస్–ఎ1 ఆధారిత అడాప్టివ్ ఎక్స్‌టర్నల్ రేడియోథెరపీని 88 ఏళ్ళ వ్యక్తికి విజయవంతంగా అందించారు. హైరిస్క్ ప్రోస్టేట్ క్యాన్సర్‌తో బాధపడుతున్న 88 ఏళ్ళ బత్రా (పేరు మార్చారు)కు అధునాతన ఎక్స్‌టర్నల్ రేడియోథెరపీని డాక్టర్ హర్జోత్ కౌర్ బజ్వా నాయకత్వంలో విజయవంతంగా అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ హర్జోత్ మాట్లాడుతూ మూడు నెలలుగా మూత్ర విసర్జన చేయడానికి ఇబ్బందులు పడుతుండడంతో వైద్య పరీక్షల్లో హైరిస్క్ ప్రోస్టేట్ క్యాన్సర్ (అడ్వాన్స్ స్టేజ్)తో బాధపడుతున్నట్టు గుర్తించినట్లు వివరించారు. ప్రోస్టేట్ గ్రంధిలో కణాలు నియంత్రణ లేకుండా పెరగడం వలన ప్రోస్టేట్ క్యాన్సర్ వస్తుందన్నారు. ఏఓఐ హైదరాబాద్ ప్రాంతీయ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డా.ప్రభాకర్ మాట్లాడుతూ ఆంకాలజీ రంగంలో అమెరికన్ ఆంకాలజీ ఇనిస్టిట్యూట్ అత్యాధునిక వైద్యం అందిస్తుందన్నారు.

ఘనంగా దుర్గామాత ఊరేగింపు



మియాపూర్: దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మియాపూర్ పరిధిలోని న్యూ కాలనీలో శ్రీ దుర్గాదేవి అమ్మవారి ఊరేగింపును గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ హాజరై పూజలు నిర్వహించారు.

10 మందికి జరిమానా..

పటాన్‌చెరు టౌన్: డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు 10 మందికి జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..బుధ, గురువారం నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్‌లో 10 మందిని పట్టుకున్నట్లు చెప్పారు.పట్టుబడిన వాహనదారులను శుక్రవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా జడ్జి 10 మందికి ఒక్కొక్కరికీ రూ.2 వేలు జరిమాన విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

గచ్చిబౌలి: వాకింగ్ వెళ్లిన వ్యక్తి విద్యుదాఘాతంతో మృతి చెందిన సంఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ భానుప్రసాద్ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. కొండాపూర్‌లోని రాజరాజేశ్వరీనగర్‌లో ఎస్ఎల్ఎన్ఎస్ కొండపల్లి ఎన్‌క్లేవ్‌లో నివాసం ఉండె కలవెండి వెంకట అనంత పద్మనాభ శాస్త్రి(67) గురువారం ఉదయం 8.15 గంటలకు వాకింగ్‌కు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో అతనికి వరుసకు అల్లుడైన శ్రీకాంత్ వెతుకుతుండగా రోడ్డుపైన శాస్త్రి స్పృహతప్పి పడిపోతూ విద్యుత్ స్తంభాన్ని పట్టుకొని కిందపడటం చూశాడు. దగ్గరి వెళ్లి చూడగా అపస్మారక స్థితిలో ఉండటంతో వెంటనే సమీపంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించాడు. అప్పటికే అతను మృతి చెందినట్లుగా వైద్యులు ధృవీకరించారు. విద్యుత్ స్తంభాన్ని పట్టుకున్నప్పుడు విద్యుదాఘాతానికి గురైనట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లు.. చింతలేని అధికారులు



నందానగర్ పెంతెకోస్ట్ చర్చి గల్లీలో చిన్నారులకు అందేంత ఎత్తులో ట్రాన్స్‌ఫార్మర్



రంగారెడ్డినగర్ బ్రైట్‌కాన్సెప్ట్ స్కూల్ సమీపంలో కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్

రక్షణ కంచెలేని, తక్కువ ఎత్తులో దిమ్మెలు నిర్మించిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని సంజయ్‌గాంధీనగర్ ప్రభుత్వ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఎదురుగా ఉన్న ఖాళీ ప్రదేశంలో ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ రక్షణ కంచె ఏర్పాటు చేయలేదు. దీంతో ఆడుకునే సమయంలో విద్యార్థులు ప్రమాదశాత్తు తాకే ప్రమాదముందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదే విధంగా నందానగర్‌లోని పెంతెకోస్ట్ చర్చి వీధిలో చిన్నారులకు అందేంత ఎత్తులో దిమ్మెపై ట్రాన్స్‌ఫార్మ్‌ను ఏర్పాటు చేశారు. రంగారెడ్డినగర్‌లోని బ్రైట్‌కాన్సెప్ట్ స్కూల్ సమీపంలో రోడ్డుపై కంచె లేకుండా మరో ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉన్నాయి. వీటి చుట్టూ అధికారులు రక్షణ కంచెలు ఏర్పాటు చేసి ప్రమాదాలు జరుగకుండా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

– రంగారెడ్డినగర్



సంజయ్‌గాంధీనగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఎదురుగా ప్రమాదకరంగా

ఓటర్లకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు

కుత్బుల్లాపూర్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి పులి సైదులు

కుత్బుల్లాపూర్: పోలింగ్ కేంద్రాల్లో అన్ని మౌలిక వసతులు కల్పించే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు కుత్బుల్లాపూర్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి పులి సైదులు పేర్కొన్నారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం పోలింగ్ స్టేషన్లను సిబ్బందితో కలిసి పరిశీలించారు. మొత్తం అసెంబ్లీ పరిధిలో 582 పోలింగ్ స్టేషన్లలో అన్ని వసతులు కల్పిస్తున్నామని అన్నారు. పోలింగ్ ఏజెంట్లకు సిబ్బందికి ఓటు వేసే ప్రతి ఒక్కరికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టామని తెలిపారు. సజావుగా ఎన్నికలు నిర్వహణ ఉంటుందన్నారు. ఇప్పటికే సమస్యాత్మక పోలింగ్ స్టేషన్ల వివరాలను పోలీసులకు అందజేశామన్నారు. ఒకవైపు బాలనగర్ మరో వైపు మేడ్చల్ డీసీపీల పరిధిలో అసెంబ్లీ విస్తరించి ఉందని పక్క ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని 'సాక్షి'తో అన్నారు. గాజులరామారం కుత్బుల్లాపూర్ జంట సర్కిళ్ల పరిధిలోని పలు పోలింగ్ స్టేషన్లను సందర్శించారు.



పోలింగ్ స్టేషన్లలో వసతులను పరిశీలిస్తున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి పులి సైదులు

స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలి

మేడ్చల్ జోన్ డీసీపీ శబరీష్

దుండిగల్: ప్రజలు ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని మేడ్చల్ జోన్ డీసీపీ శబరీష్ అన్నారు. దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. అక్కడి ప్రజలతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ డబ్బు, మద్యం ప్రవాహాన్ని అడ్డుకుంటున్నామన్నారు. ఎన్నికల విధుల్లో తమ పోలీసులు అప్రమత్తంగా ఉన్నారని తెలిపారు. ఎక్కడికక్కడ చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి తనిఖీలను ముమ్మరం చేశామన్నారు. ప్రజలు సైతం పోలీసులకు సహకరించాలన్నారు. బాధ్యత కలిగిన ప్రతి పౌరుడు తమ ఓటు హక్కును వినియోంచుకుకోవాలని కోరారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. ఆయన వెంట దుండిగల్ సీఐ రామకృష్ణ, ఎస్సైలు రాజేశ్, ఈశ్వర్, ఏఎస్సై కిష్టయ్య, సిబ్బంది ఉన్నారు.



స్థానికులతో మాట్లాడుతున్న మేడ్చల్ జోన్ డీసీపీ శబరీష్

జ్యూస్ పాయింట్‌లో షార్ట్‌సర్క్యూట్

అగ్నికి ఆహుతైన సామగ్రి

సుభాష్‌నగర్: విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ సంభవించి ఓ జ్యూస్ పాయింట్ అగ్నికి ఆహుతి అయింది. దీంతో రూ.6లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. జ్యూస్ పాయింట్‌లో నిద్రిస్తున్న ఇద్దరు వ్యక్తులు మంటలను తప్పించుకోగా.. అప్రమత్తమైన స్థానికులు చెలరేగిన మంటలను అదుపులోకి తీసుకురావడంతో సమీపంలో ఉన్న మరో నాలుగు దుకాణాలను కాపాడగలిగారు.

◆ సుచిత్రలోని వెన్నెలగడ్డ ప్రధాన రోడ్డు అనుకొని సాయిగౌడ్ అనే వ్యక్తి ×ది జ్యూస్ బార్‌₹పేరిట జ్యూస్ పాయింట్ నడిపిస్తున్నాడు. రోజువారీగా పనులు ముగించుకుని గురువారం రాత్రి అందులో ఉన్న సిబ్బంది రాత్రి 12:30కు మూసివేశారు. అందులో నలుగురు పనిచేస్తుండగా రంజిత్, ముకేశ్‌లు జ్యూస్ పాయింట్‌లోనే ఉంటారు. శుక్రవారం తెల్లవారుజామున 3గంటల సమయంలో జ్యూస్ పాయింట్ లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి.

◆ అందులో ఉన్న ఐదు ఫ్రిజ్‌లు, రెండు ఏసీలు మంటల దాటికి పెద్ద శబ్దంతో పేలగా అందులో ఉన్న రంజిత్, ముకేశ్‌లు బయటకు వచ్చారు. అదే సమయంలో అటుగా వెళుతున్న పేట్‌బషీరాబాద్ పెట్రోలింగ్ పోలీసులు గమనించి చుట్టుప్రక్కల ఆనుకొని ఉన్న ఇళ్లను, దుకాణదారులను అప్రమత్తం చేసి వారిని ఇళ్ల నుంచి బయటకు తరలించారు.



అగ్ని ప్రమాదంలో బూడిద అయిన జ్యూస్ పాయింట్ సెంటర్.



◆ జ్యూస్ సెంటర్‌ను అనుకొని ఉన్న బండి శ్రీనివాస్‌గౌడ్, మధుసూదన్‌గౌడ్ ఇంటి మూడో అంతస్తు వరకు మంటలు చెలరేగడంతో స్థానికులు, వారి కుటుంబ సభ్యులు భవనం పైనుంచి గంట పాటు నీరు చల్లడంతో మంటలు అదుపులోకి వచ్చాయి. సమాచారం అందుకున్న జీడిమెట్ల ఫైర్ సిబ్బంది అక్కడ చేరుకొని స్వల్పంగా ఉన్న మంటలను ఆర్పి వేశారు.

పెను ప్రమాదం తప్పింది.....

ప్రమాదం జరిగిన న్యూస్ సెంటర్ అనుకొని ఉన్న బండి శ్రీనివాస్‌గౌడ్, మధుసూదన్ గౌడ్ ఇంటి పైపులు డోర్లు కాలిపోయాయి. పక్కనే ఉన్న ఫ్లెక్సీ షాప్ మంటలు అంటుకోవడంతో ఏసి కాలిపోయింది. కిరాణా, కూరగాయల షాపుకు మంటలు ఆర్పి వేయడంతో పెను ప్రమాదం తప్పింది.

రూ.5.50 లక్షలు నగదు సీజ్

కుత్బుల్లాపూర్: ఎన్నికల తనిఖీల్లో పేట్‌బషీరాబాద్ పోలీసులు నగదును స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం దూలపల్లిలో వాహనాల సోదాలు చేపట్టిన పోలీసులు ఓ కారులో రాకేష్, లక్ష్మణ్‌లు అనే వ్యక్తులు తీసుకెళ్తున్న రూ.5.50 లక్షలు నగదు సీజ్ చేశారు. నగదుకు సంబంధించి సరైన ధ్రువపత్రాలు చూపించకపోవడంతో సొత్తును ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు అప్పగించనున్నట్లు పేట్ బషీరాబాద్ సీఐ ప్రశాంత్ 'సాక్షి'కి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

దుండిగల్: ఎదురుగా వస్తున్న బైక్‌ను మరో బైక్ ఢీ కొట్టడంతో భార్యాభర్తలతో పాటు మరో వ్యక్తి గాయపడ్డాడు. ఈ సంఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. డి.పోచంపల్లి గ్రామానికి చెందిన కంది వెంకన్న, రమాదేవి భార్యాభర్తలు. వీరు బైక్‌పై డి.పోచంపల్లి నుంచి గండిమైసమ్మ చౌరస్తా వైపు వస్తున్నారు. అదే సమయంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి తన బైక్‌పై ఎదురుగా వస్తున్నాడు. ఈ క్రమంలో చింతలకుంట చెరువు వద్ద వేగంగా వచ్చిన సదరు వ్యక్తి భార్యాభర్తలను ఢీ కొట్టాడు. ఈ ఘటనలో వెంకన్నకు తీవ్ర గాయాలు కాగా రమాదేవి, గుర్తు తెలియని వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు వీరిని వెంటనే సూరారంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. ఈ మేరకు దుండిగల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కార్పొరేషన్ అభివృద్ధే ధ్యేయం

కుత్బుల్లాపూర్: కార్పొరేషన్ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నామని నిజాంపేట్ మేయర్ కొలన్ నీలా రెడ్డి అన్నారు. శుక్రవారం నిజాంపేట్ కార్పొరేషన్ 17వ డివిజన్ కార్పొరేటర్ ఆగం రాజుముదిరాజ్ ఆధ్వర్యంలో డివిజన్ ప్రజలు మేయర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు కార్యక్రమాలు, ప్రారంభోత్సవాలకు రావాల్సిందిగా కోరుతూ ఆహ్వాన పత్రికలు అందజేశారు. ఈ సందర్భంగా నీలారెడ్డి మాట్లాడుతూ.. నిజాంపేట్ కార్పొరేషన్ పరిదిలో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేసి ముందుకు సాగుతున్నామని తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు చంద్రగిరి సతీష్, రాజమోహన్‌రెడ్డి, రవీంద్రబాబు, రమణ, కృష్ణంరాజు, సల్మాన్, మూస తదితరులు ఉన్నారు.

స్పందించారు.. తొలగించారు

జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని పలు బతుకమ్మ కుంటల్లో పూలను తొలగించలేదు. దీంతో 'సాక్షి'లో ప్రచురితమైన 'బతుకమ్మ కుంటలను శుభ్రం చేయండి'వార్తకు అధికారులు స్పందించారు. డివిజన్ పరిధిలోని భూదేవిహిల్స్, సోమయ్యనగర్ తదితర ప్రాంతల్లో కుంటల్లో పేరుకుపోయిన పూలను తొలగించారు.



అవును.. వాళ్లంతా ఒక్కటయ్యారు!

మంత్రి కేటీఆర్ సమక్షంలో ఎమ్మెల్యేను కలిసిన కార్పొరేటర్లు



కుత్బుల్లాపూర్: నిన్న మొన్నటి వరకు బీఆర్ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే వివేకానంద్‌తో ఎడమొహం పెడమొహంగా ఉంటూ వస్తున్న కార్పొరేటర్లు ఎట్టకేలకు 'రాజీ'కొచ్చారు. మంత్రి కేటీఆర్ సమక్షంలో మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ శంభీపూర్ రాజు చొరవ తీసుకొని ఎమ్మెల్యే వివేకానంద గెలుపు కోసం పని చేయాలని సూచించడంతో వారంతా ఒక్కటయ్యారు.

గత మూడు సంవత్సరాలుగా కుత్బుల్లాపూర్ గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలోని డివిజన్లలో ఎవరికి వారే అభివృద్ధి కార్యక్రమాల్లో వేరు వేరుగా పాల్గొంటూ వచ్చారు. ఎట్టకేలకు అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కార్పొరేటర్లు రావుల శేషగిరి, జగన్ మంత్రి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, చింతల్ డివిజన్ కార్పొరేటర్ భర్త మహమ్మద్ రఫీలు ఎమ్మెల్యే అభ్యర్థి వివేకానందతో కలవడం బీఆర్ఎస్ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది.

'ఎమ్మెల్యే వివేకానందకు ఓటమి భయం పట్టుకుంది'



కూన శ్రీశైలంగౌడ్‌ను పరామర్శిస్తున్న బీజేపీ జాతీయ నాయకుడు మురళీధర్‌రావు

కుత్బుల్లాపూర్: ప్రజల్లో బీజేపీపై పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేక కుత్బుల్లాపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ బీజేపీ అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్‌పై దాడి చేశాడని బీజేపీ జాతీయ నాయకుడు మురళీధర్‌రావు అన్నారు. ఓ న్యూస్ చానల్ నిర్వహించిన డిబేట్‌లో శ్రీశైలంగౌడ్‌పై భౌతికంగా దాడి చేయడాన్ని ఆయన ఖండించారు. శుక్రవారం షాపూర్‌నగర్‌లో నివాసంలో శ్రీశైలంగౌడ్‌ను ఆయన పరామర్శించారు.

◆ అనంతరం మురళీధర్‌రావు మాట్లాడుతూ... ఎమ్మెల్యే వివేకానందకు ఓటమి భయం పట్టుకుందని, ఓడిపేతానని భయంతోనే దాడి చేశాడని అన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద కండకావరం ఎక్కువై తమ అభ్యర్థిపై దాడులకు దిగాడన్నారు. ప్రశ్నిస్తే దాడులు చేయడం ఏమిటని మండిపడ్డారు. ఇది మీకు కేసీఆర్ నేర్పిన సంస్కారమా అని ప్రశ్నించారు.

◆ ప్రజా సమస్యలపై పోరాడుతున్న శ్రీశైలంగౌడ్ తనపై భౌతికంగా దాడి చేసినా భరిస్తున్నారని... బీఆర్ఎస్ అభ్యర్థి వివేకానంద లాగా బరితెగించలేదని అన్నారు. ఆయన తలుచుకుంటే ఎమ్మెల్యేను నలిపేయొచ్చు కానీ అది బీజేపీ సంస్కారం కాదని అన్నారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ అండదండలు చూసుకుని బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు ఎగిరెగిరి పడుతున్నారని, వచ్చే ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. కుత్బుల్లాపూర్ బీఆర్ఎస్ అభ్యర్థికి ఈ ఎన్నికల్లో డిపాజిట్టు కూడా దక్కకుండా ఓడించాలని కుత్బుల్లాపూర్ ప్రజలకు పిలుపునిచ్చారు.

కూన ప్రతాప్‌గౌడ్‌ను కలిసిన కొలన్ హన్మంతరెడ్డి



కాంగ్రెస్ అభ్యర్థి హన్మంతరెడ్డిని సత్కరించిన బీఆర్ఎస్ నేత ప్రతాప్‌గౌడ్, కేపీ విశాల్‌గౌడ్

కుత్బుల్లాపూర్: కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కొలన్ హన్మంతరెడ్డి బీఆర్ఎస్ నేత, మాజీ డీసీసీ అధ్యక్షుడు కూన ప్రతాప్‌గౌడ్‌ను కలవడం రాజకీయంగా చర్చానీయాంశంగా మారింది. శుక్రవారం ప్రతాప్‌ను ఆయన నివాసంలో కలిసిన హన్మంతరెడ్డి వచ్చే ఎన్నికల్లో తన విజయానికి మద్దతు ఇవ్వాలని కోరారు. దీనికి సానుకూలంగా స్పందించిన ప్రతాప్ తన సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. మాజీ డీసీసీ అధ్యక్షుడిగా పని చేసిన ప్రతాప్ గతంలో కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేశారు. ఎమ్మెల్యే వివేకానంద్‌కు సొంత బాబాయ్ అయిన ప్రతాప్, ఆయన కుమారుడు కేపీ విశాల్‌గౌడ్‌లు కాంగ్రెస్ అభ్యర్థి హన్మంతరెడ్డికి మద్దతు ఇవ్వడం రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది.

ఎమ్మెల్యేపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

ఎన్నికల అధికారికి బీజేపీ నేతల ఫిర్యాదు

కుత్బుల్లాపూర్: టీవీ చానల్ డిబేట్‌లో మాజీ ఎమ్మెల్యే, బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్‌పై ఎమ్మెల్యే భౌతిక దాడికి దిగడంపై శుక్రవారం బీజేపీ నాయకులు కుత్బుల్లాపూర్ ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ బుచ్చిరెడ్డి మాట్లాడుతూ ఉద్దేశపూర్వకంగానే ఎమ్మెల్యే వివేకానంద్ దాడికి దిగారని, ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రత్యర్థి పార్టీ అభ్యర్థి అయిన శ్రీశైలంగౌడ్‌పై దాడికి పాల్పడిన ఎమ్మెల్యేపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఆయనను ఎన్నికల్లో పోటీ చేసేందుకు అనర్హుడిగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

ఎమ్మెల్యే వివేకానంద్‌కు ఏఐఎంఐఎం నేతల మద్దతు



ఎమ్మెల్యే వివేకానంద్‌కు మద్దతు తెలుపుతున్న ఏఐఎంఐఎం నాయకులు

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో గత తొమ్మిదేళ్లుగా జరిగిన అభివృద్ధిని చూసి అన్ని వర్గాల ప్రజలు బీఆర్ఎస్‌కు మద్దుతు తెలుపుతున్నారని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. శుక్రవారం సూరారం డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు పుప్పాల భాస్కర్ ఆధ్వర్యంలో నెహ్రూనగర్‌కు చెందిన పలువురు యువకులు ఎమ్మెల్యే కేపీ వివేకానంద సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుతో నూతన పరిశ్రమలు, ఐటీ హబ్ ల ఏర్పాటుతో యువతకు ఉపాధి అవకాశాలు పెరిగాయన్నారు, రాష్ట్ర అభివృద్ధి జరగాలన్న, రాష్ట్ర ప్రజలకు సంక్షేమ పథకాలు అందించాలన్న మరోసారి బీఆర్ఎస్ పార్టీని ఆదరించాలన్నారు.

◆ కొంపల్లి లోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఏఐఎంఐఎం నాయకులు ఎమ్మెల్సీ, కుత్బుల్లాపూర్ ఇంచార్జ్ మీర్జా రహమత్ బేగ్ హాజరై ఎమ్మెల్యే వివేకానంద్ తమ పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ఎంఐఎం పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ మునీరుద్దీన్ తదితరులు ఉన్నారు.

ఎమ్మార్పీఎస్ జిల్లా సదస్సును విజయవంతం చేయాలి

చింతల్: ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధత కోసం నవంబర్ 18న హైదరాబాద్‌లో జరిగే మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయడానికి ఈనెల 29న చింతల్ పరిధిలోని భగత్‌సింగ్‌నగర్‌లో ఎమ్మార్పీఎస్ మేడ్చల్ జిల్లా సదస్సును నిర్వహిస్తున్నామని.. మాదిగ, ఉపకులాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోవిందు నరేష్ మాదిగ పిలుపునిచ్చారు. శుక్రవారం షాపూర్‌నగర్లోని ఉషోదయ టవర్స్‌లో సిలువేరు శ్రీనివాస్ మాదిగ అధ్యక్షతన నిర్వహించిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ సమీక్ష సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన గోవిందు నరేష్ మాదిగ మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ ద్వారానే మాదిగ, ఉప కులాల ప్రజలకు విద్యా ఉద్యోగ సంక్షేమ రాజకీయ రంగాల్లో న్యాయం జరుగుతుందన్నారు. అందుకోసం భగత్ సింగ్ నగర్ లో నిర్వహించే సన్నాహక జిల్లా సభకు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సభకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు పంగ ప్రణయ్ కుమార్ మాదిగ, సీనియర్ నాయకులు రాస మల్ల యాదగిరి, మేడ సంజీవ, బండారి సాయి నరసింహా, భూమన్న, రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.



ఉషోదయ టవర్స్‌లో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ నేతలు